సాక్షి విశాఖపట్నం

మంగళవారం । 21 । మార్చి । 2023



స్పందన అర్జీలపై జేసీ సమీక్ష

స్పందన అర్జీలను కాలపరిమితిలోగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు.

8లో



ప్రయోగాలపై దృష్టి సారించాలి

సైన్స్ సంబంధిత రంగాల్లో ప్రయోగాల వైపు విద్యార్థులు దృష్టి సారించాలని డీఈవో చంద్రకళ అన్నారు.

8లో



స్మార్ట్‌గా పాఠాలు..!

అంతర్జాతీయ ప్రమాణాలతో నాణ్యమైన విద్యాబోధన సాగేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంది.

8లో

న్యూస్‌రీల్

రేపు ఉదయం 4.30 గంటల నుంచి శ్రీవారి దర్శనం



శ్రీవారి ఆలయ ముఖద్వారం

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఉగాది పర్వదినం సందర్భంగా బుధవారం ఉదయం 4.30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు సర్వ దర్శనాలు కల్పించనున్నట్లు ఆలయ ఏఈవో రమేష్ తెలిపారు. ఉదయం 2.30 గంటల నుంచి 3 గంటల వరకు సుప్రభాత సేవ, 3 నుంచి 4.30 గంటల వరకు తోమాల, అర్చన, మొదటి గంట, 4.30 నుంచి 8.00 గంటల వరకు సర్వ దర్శనం, 8 నుంచి 9 గంటల వరకు రెండో **గంట, 9 నుంచి** 6 వరకు సర్వదర్శనం. 9.30 నుం**చి 10.30 గం**టల వరకు ఉగాది ఆస్థానం, **పంచాంగ** శ్రవణం, సాయంత్రం 6 నుంచి **6.45 గంటల** వరకు సాయంకాల ఆరాధన, అ**ర్చన నివేదన,** 6.45 నుంచి 10 గంటల వరకు **సర్వదర్శనం,** రాత్రి 10 నుంచి 10.30 వరకు **ఏకాంత సేవ** నిర్వహించనున్నామని పేర్కొన్నా**రు.**

ఏయూ బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్‌కు ఆర్‌సీఐ గుర్తింపు



ఉత్తర్వులను వీసీ ఆచార్య ప్రసాదరెడ్డికి అందిస్తున్న ఆచార్య షారోన్ రాజు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సుకు రీహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు లభించింది. ఇటీవల ఏయూను సందర్శించిన ఆర్‌సీఐ నిపుణుల కమిటీ సభ్యులు ఏయూలో కోర్సు నిర్వహణకు అవసరమైన మౌలిక వసతులు, సదుపాయాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. నిపుణుల నివేదిక ఆధారంగా ఆర్‌సీఐ గుర్తింపును ప్రకటించింది. రెండు సంవత్సరాల కాల వ్యవధితో బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సును ఏయూ నిర్వహిస్తుంది. ఒక్కో సంవత్సరం 30 మందికి ప్రవేశం కల్పిస్తారు. 2027 సంవత్సరం వరకు కోర్సు నిర్వహణకు ఆర్‌సీఐ అనుమతి అందించింది. ఈ సందర్భంగా ఆర్‌సీఐ అందించిన ఉత్తర్వులను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డికి విద్య విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు అందజేశారు.

క్రీడాకారులకు స్కాలర్‌షిప్

విశాఖ స్పోర్ట్స్: జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన క్రీడాకారులకు ఆయిల్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్(ఓఎన్‌జీసీ) స్కాలర్‌షిప్ అందించనుంది. ఈనెల 27వ తేదీలోపు http://sportsscholorship.ongc.com వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని క్రీడాప్రాధికార సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది.

ఎయిర్‌ఫోర్స్‌లో చేరండి...

భారత వైమానికదళం (అగ్నివీర్-23)లో చేరేందుకు అవివాహిత పురుష, మహిళా క్రీడాకారులు ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని క్రీడా ప్రాధికార సంస్థ పేర్కొంది. విద్యార్హతలు, వయసు, ఇతర అర్హత ప్రమాణాల కోసం http:// agnipathvayu.cdac.in వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చు.

3న ఇగ్నో వార్షికోత్సవం

ఎంవీపీకాలనీ: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో ఏప్రిల్ 3వ తేదీన 36వ వార్షికోత్సవం నిర్వహించనున్నారు. జైల్‌రోడ్డు దరి విశాఖ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ వేడుకలు జరగనున్నాయి. విశాఖ ఇగ్నో ప్రాంతీయ కార్యాలయం పరిధిలో వివిధ డిగ్రీలు పొందిన వారికి ఈ వార్షికోత్సవం సందర్భంగా డిగ్రీలను ప్రదానం చేయనున్నట్లు ఇగ్నో ప్రాంతీయ కార్యాలయం డైరెక్టర్ డాక్టర్ గోనిపాటి ధర్మారావు తెలిపారు. కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం (విజయనగరం) వీసీ ఆచార్య టీవీ కట్టిమణి ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొననున్నట్లు వెల్లడించారు.

ఇంటర్ పరీక్షలకు 712 మంది గైర్హాజరు

విశాఖ విద్య: ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సోమవారం నిర్వహించిన గణితం /బోటనీ/ సివిక్స్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. విశాఖ జిల్లాలో జనరల్, ఒకేషనల్ కోర్సులు కలిపి 41,913 మంది విద్యార్థులకు గాను 41,201 మంది హాజరయ్యారు. 712 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఇంటర్మీడియెట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి పి. ఉమారాణి తెలిపారు. మాల్ ప్రాక్టీస్‌కు ఆస్కారం లేకుండా పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహించాలని ఆమె కేంద్రాల నిర్వాహకులకు సూచించారు.

'బ్లూ'టిఫుల్ సీ!



నీలి మేఘాలలో.. గాలి కెరటాలలో..! అని ఓ సినీ కవి వర్ణించినట్టు విశాఖ సాగర తీరం కారుమబ్బులతో కనువిందు చేసింది. సోమవారం సాయంత్రం ఆకాశం, సముద్రం నీలి రంగులోకి మారిపోయాయి. దాదాపు గంటకు పైగా అలానే అలరించింది. అదే సమయంలో చల్లని గాలి కూడా వీస్తూ ఆహ్లాదాన్ని పంచింది. సాగరతీర అందాలను ఆస్వాదించడానికి వచ్చిన వారికి ఈ 'బ్లూటిఫుల్ సీ' ఎంతగానో ఆకట్టుకుంది.

- పీఎల్ మోహన్‌రావు, సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

దంచికొట్టిన వాన!

- సాయంత్రం నుంచి కుమ్మరింత
- పెదగంట్యాడలో అత్యధికంగా 8.2 సెం.మీల వర్షపాతం
- నేడూ వర్షాలకు ఆస్కారం

సాక్షి, విశాఖపట్నం: విశాఖపై వరుణుడు ప్రతాపం చూపుతున్నాడు. ఆదివారం వర్షంతో అదరగొట్టాడు. సోమవారం పగలంతా సాధారణ వాతావరణమే నెలకొంది. దీంతో ఇక వర్షం తగ్గుముఖం పడుతుందనుకుంటున్న తరుణంలో సాయంత్రం ఒక్కసారిగా ఆకాశం మేఘావృతంగా మారిపోయింది. చీకటి పడే సమయానికి జడివాన మొదలైంది. అలా రాత్రి 10 గంటలు దాటే వరకు నగరం నలుమూలలా జోరున వర్షం దంచికొడుతూనే ఉంది. విశాఖ నగరంలో అత్యధికంగా పెదగంట్యాడలో 8.2 సెం.మీల వర్షపాతం నమోదైంది. ఇంకా పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. మంగళవారం కూడా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉంది.



పెదగదిలి కూడలిలో రహదారిపై భారీగా వర్షం నీరు





నగరంలో వర్షపాతం (సెం.మీలలో)

ప్రాంతం	వర్షపాతం
పెదగంట్యాడ	8.2
గంగవరం	6.6
మల్కాపురం	5.6
ఎండాడ	5.0
గాజువాక	4.6
ఆరిలోవ	4.5
సింహాచలం	3.7
పెందుర్తి	3.1
సింహాచలం	2.8

విశాఖ పర్యాటక వైభవం

- జీఐఎస్‌లో రూ.8,806.44 కోట్లతో ప్రాజెక్టులకు ఎంవోయూలు
- 18,205 మందికి ఉపాధి అవకాశాలు
- అల్లూరి జిల్లాలోనూ పర్యాటకం పరుగులు
- 64 ప్రాజెక్టుల గ్రౌండింగ్‌పై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసిన ప్రభుత్వం



టన్నెల్ అక్వేరియం



ఒబెరాయ్ హోటల్

సాక్షి, విశాఖపట్నం : ప్రకృతి అందాలతో అలరారే విశాఖ పర్యాటకాన్ని కొత్త పుంతలు తొక్కేందుకు సరికొత్త ఆలోచనలతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోంది. ప్రపంచ పర్యాటక పటంలో టూరిజం రాజధానిగా భాసిల్లే విధంగా పలు ప్రాజెక్టులకు సంబంధించి ఇటీవల నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో కీలక ఒప్పందాలు కుదుర్చుకుంది. దేశీ, విదేశీ పర్యాటకులను మంత్రముగ్ధులను చేస్తున్న విశాఖలో ఉన్న టూరిజం స్థలాలను వినియోగంలోకి తీసుకువస్తూ.. జలక్రీడలు, సాహస పర్యాటకం, బీచ్ టూరిజం, టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం, టెంపుల్ టూరిజం.. ఇలా భిన్నమైన సెగ్మెంట్లలో అభివృద్ధికి అడుగులు వేస్తోంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో మొత్తం 64 ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించింది. మొత్తం రూ.8,800 కోట్లకు పైగా ప్రాజెక్టుల ద్వారా 18 వేల మందికి ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. ఈ ప్రాజెక్టుల గ్రౌండింగ్ చేసే విషయంలోనూ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తోంది.

రూ.8,800 కోట్లు.. 18 వేల మందికి ఉపాధి


ఉమ్మడి విశాఖ జిల్లాలో పర్యాటక అవకాశాలు పుష్కలంగా ఉన్న ప్రతి ప్రాంతంలోనూ ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు వివిధ సంస్థలు ముందుకొచ్చాయి. మొత్తంగా పర్యాటక రంగానికి సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా రూ.21,941 కోట్లతో 129 ప్రాజెక్టులకు ఎంవోయూలు జరగ్గా.. ఇందులో సగం వరకు అంటే 64 ప్రాజెక్టులు ఉమ్మడి విశాఖకు సంబంధించినవి కావడం విశేషం. మొత్తం రూ.8,806.44 కోట్లతో విభిన్న రకాల ప్రాజెక్టులు రానున్నాయి. దీని ద్వారా ప్రత్యక్షంగా 18,205 మందికి ఉపాధి అవకాశాలు రానుండగా.. మరో 20 వేల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు కలగనున్నాయి.

అల్లూరి జిల్లాకూ అద్భుత అవకాశాలు

అరకు, పాడేరు ప్రాంతాల్లోనూ భారీ ప్రాజెక్టులు **రానున్నాయి. అల్లూరి జిల్లా పరిధిలోని పర్యాటక ప్రాంతాలకు టూరిస్టుల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో ఆయా ప్రాంతాల్లోనూ తమ కార్యకలా**పాలు ప్రారంభించేందుకు సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయి. మారేడుమిల్లిలో రూ.1000 కోట్లతో తులి హోటల్స్ ప్రై.లిమిటెడ్ సంస్థ సఫారీ టూరిజం ప్రాజెక్టుని ఏర్పాటు చేసి 1000 మందికి ఉపాధి కల్పించనుంది. విశాఖ–అరకు రోడ్‌లో మైస్టిక్స్ పామ్స్ సంస్థ రూ.50 కోట్ల పెట్టుబడితో గోల్ఫ్ రిసార్ట్ అండ్ డెస్టినేషన్ వెడ్డింగ్ ఫెసిలిటీ ఏర్పాటు చేయనుంది. దీని ద్వారా 250 మందికి ఉపాధి కలగనుంది. రూ.243 కోట్లతో 1000 మందికి ఉపాధి కల్పించేలా అనంతగిరి హిల్స్‌లో ఎకో–ఐఎస్ఎల్ఈ రిసార్ట్స్ సంస్థ రిసార్ట్స్, కన్వెన్షన్ సెంటర్, ఎమ్యూజ్‌మెంట్‌థీమ్ పార్క్ ఏర్పాటు చేయనుంది. రూ.150 కోట్లతో అరకులో ది రిప్పిల్స్ సంస్థ రిసార్టులు, విల్లాలు ఏర్పాటు చేసి 150 మందికి పైగా ఉపాధి కల్పించాలని నిర్ణయించింది. వీటితో పాటు కాంపింగ్, కారావాన్ పార్క్, అడ్వెంచర్ స్పోర్ట్స్, లగ్జరీ కాటేజీలు, వుడెన్ హౌస్‌లు, మల్టీ క్యుజిన్ రెస్టారెంట్స్ కూడా రాబోతున్నాయి.

విశాఖకు రాబోతున్న ముఖ్యమైన ప్రాజెక్టులు

- సుమారు రూ.300 కోట్లతో 300 మందికి ఉపాధి కల్పించేలా ఒబెరాయ్ హోటల్స్ సంస్థ అన్నవరం సమీపంలో ఒబెరాయ్ హోటల్‌ను నిర్మించనుంది.
- రూ.208 కోట్లతో డెహ్రాడూన్‌కు చెందిన దేవ్‌భూమి రోప్‌వేస్ సంస్థ వివిధ పర్యాటక ప్రాంతాల్లో రోప్‌వే ప్రాజెక్టులు ఏర్పాటు చేయనుంది. దీని ద్వారా 50 మందికి ఉపాధి కలగలనుంది.
- రూ.1000 కోట్లతో 6,500 మందికి ఉపాధి కల్పించేలా డ్రీమ్‌వ్యాలీ గ్రూప్ సంస్థ గోల్ఫ్‌గేటెడ్ కమ్యూనిటీ విత్ 5 స్టార్ రిసార్ట్స్‌ను కట్టనుంది.
- రూ.300 కోట్లతో 750 మందికి ఉపాధి కల్పించేలా ఎంఆర్‌కేఆర్ కన్‌స్ట్రక్షన్ అండ్ ఇండస్ట్రీస్ కంపెనీ 7 స్టార్ హోటల్‌ని నిర్మించనుంది.
- రూ.500 కోట్లతో 250 మందికి ఉపాధినిస్తూ మంజీరా హోటల్స్ సంస్థ హోటల్, రిసార్టు నిర్మించేలా ఒప్పందం కుదుర్చుకుంది.



- మురుగవాణి సంస్థ రూ.150 కోట్లతో 500 మందికి ఉపాధితో ఎకో టూరిజం రిసార్టులు ఏర్పాటు చేయనుంది.
- అకొంటిపై అంతర్జాతీయ సంస్థ రూ.243 కోట్లతో 100 మందికి ఉపాధి కల్పించేలా మెగావీల్ ఏర్పాటు చేయనుంది.
- జలవిహార్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ రూ.250 కోట్లతో 500 మందికి ఉపాధి కల్పిస్తూ అన్నవరం ప్రాంతంలో జలవిహార్ టూరిజం హార్బర్‌ని నిర్మించనుంది.
- రూ.122 కోట్లతో 255 మందికి ఉపాధి కల్పించేలా గారిసన్ సంస్థ కన్వెన్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేయనుంది.
- టర్కీకి చెందిన పోలిస్ అక్వేరియమ్స్ సంస్థ రూ.120 కోట్లతో 110 మందికి ఉపాధినందిస్తూ టన్నెల్ అక్వేరియంని నిర్మించనుంది.
- రూ.115.5 కోట్లతో 150 మందికి ఉపాధి కల్పించేలా ఎండాడలో భవానీ బీచ్ రిసార్టులు రానున్నాయి.
- రూ.100 కోట్లతో 50 మందికి ఉపాధి అందించేలా అకొంటిపై అంతర్జాతీయ సంస్థ స్కైటవర్‌ని ఏర్పాటు చేయనుంది.
- రూ.85 కోట్లతో 200 మందికి ఉపాధినందించేలా ఫ్రాన్స్‌కు చెందిన ఎరోఫైల్‌సంస్థ స్కై రెస్టారెంట్, స్కై డైవింగ్, సర్ఫింగ్, మినీ వాటర్‌పార్క్‌ని నిర్మించనుంది.
- రూ.25 కోట్లతో 30 మందికి ఉపాధి కల్పిస్తూ జపాన్‌కు చెందిన సంస్థ స్నో వరల్డ్ ఏర్పాటు చేయనుంది.
- రూ.500 కోట్లతో 500 మందికి ఉపాధినందించేలా స్వామి నారాయణ్ ట్రస్ట్ డివైన్ డెస్టినేషన్ ఫర్ స్పిరుచ్యువల్ టూరిజం ప్రాజెక్టుని ఏర్పాటు చేయనుంది.

కొత్త ప్రాజెక్టులతో కొత్త కళ



పెట్టుబడుల సదస్సులో కుదుర్చుకున్న ఎంవోయూలు గ్రౌండ్ అయ్యేలా ప్రభుత్వం పకడ్బందీగా వ్యవహరిస్తోంది. ఇందులో భాగంగా పర్యాటక ప్రాజెక్టుల కోసం టూరిజం ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు చేసింది. ఏపీ సంస్థ ఎంవోయూ చేసుకుంది.. ఆ ప్రాజెక్టుకు సరిపడా స్థలాన్వేషణ, చర్చలు, మొదలైన అంశాల్ని ఈ కమిటీ పర్యవేక్షించి.. వీలైనంత త్వరగా ప్రాజెక్టు పట్టాలెక్కేలా చర్యలు తీసుకోనున్నాం. ప్రతి పర్యాటక స్థలంలోనూ ఒక విభిన్న ప్రాజెక్టు వచ్చి.. దేశ విదేశీ సందర్శకుల్ని ఆకట్టుకునేలా తీర్చిదిద్దాలన్న ఆలోచనలు త్వరలోనే అమలు కానున్నాయి.

– శ్రీనివాస్ పాణి, పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్

జీ 20తో పెరగనున్న విశాఖ బ్రాండ్



జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తున్న పోలీస్ కమిషనర్ శ్రీకాంత్

దొండపర్తి: జీ–20 సదస్సుతో విశాఖపట్నం బ్రాండ్ విలువ మరింత పెరుగుతుందని సీపీ శ్రీకాంత్ పేర్కొన్నారు. జీ–20 సమ్మిట్‌పై జిల్లా యంత్రాంగం, పర్యాటక శాఖ అధికారులు, స్టేక్ హోల్డర్లకు అవగాహన కల్పించేందుకు కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ నగరంలో వర్క్‌షాప్ నిర్వహించింది. జీ–20 సదస్సు ప్రాధాన్యత, దేశంలో పర్యాటకం, క్రాస్–కల్చరల్ హ్యాండ్లింగ్, వ్యక్తిగత వస్త్రధారణ, పరిశుభ్రత వంటి అంశాలపై హైదరాబాద్‌లోని ఐహెచ్ఎం రిసోర్స్‌పర్సన్లు సెషన్స్ నిర్వహించారు. సీపీ శ్రీకాంత్ మాట్లాడుతూ జీ–20 సదస్సు విజయవంతానికి అన్ని శాఖల సమన్వయం, పోలీసుల పాత్రపై పలు సూచనలు చేశారు. జీ–20 సెక్రటేరియట్ జాయింట్ సెక్రటరీ భావన సక్సేనా వర్చువల్ పాల్గొని సదస్సు ప్రాముఖ్యతను, దేశానికి కలిగే ప్రయోజనాలను వెల్లడించారు. కేంద్ర టూరిజం శాఖ ఏడీ శంకర్‌రెడ్డి ప్రారంభోపన్యాసం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర టూరిజం శాఖ రీజనల్ డైరెక్టర్ శ్రీనివాస్, ఏపీ హోటల్స్ అసోసియేషన్స్ వైస్ ప్రెసిడెంట్ ఎ.వి.పవన్ కార్తీక్, ఎయిర్‌పోర్ట్, సీఐఎస్ఎఫ్, పోలీస్, టూరిజం, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే సదస్సు విజయవంతం

జీ20 సదస్సును అన్ని శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలని పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ పలు శాఖల అధికారులకు పిలుపునిచ్చారు. జీ20 సదస్సు సందర్భంగా సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో పలు శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. అంతర్జాతీయ సదస్సుకు వచ్చే విదేశీ ప్రతినిధుల షెడ్యూల్, రూట్‌మ్యాప్ వంటి పలు అంశాలను చర్చించారు. ఈ సమావేశంలో నేవీ, రెవెన్యూ, జీవీఎంసీ, మెరైన్ పోలీస్, కోస్ట్‌గార్డ్, ఐటీ, టూరిజం, ఆరోగ్య శాఖ, ఎయిర్‌పోర్ట్ అథారిటీ, సీఐఎస్ఎఫ్, ఎస్ఐబీ, ఫైర్ డిపార్ట్‌మెంట్, ప్రముఖ హోటళ్ల భద్రతా అధికారులు, ఏపీఈపీడీసీఎల్ అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి బడిలో రాగిజావ

- మంగళ, గురు, శనివారం విద్యార్థులకు అందజేత
- విశాఖ జిల్లాలో 587 ప్రభుత్వ పాఠశాలల్లో అమలు
- 87,792 మంది విద్యార్థులకు ప్రయోజనం



అడవివరం జెడ్పీ హైస్కూల్ హెచ్ఎంకు రాగిజావ ప్యాకెట్‌ను అందజేస్తున్న డీఈవో

విశాఖ విద్య : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రాగి జావ అందించేందుకు అంతా సిద్ధమైంది. జిల్లాలో మంగళవారం నుంచి దీనిని అమలు చేసేందుకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ఇక నుంచి వారంలో మూడు రోజులు (మంగళ, గురు, శనివారం) విద్యార్థులకు రాగిజావ ఇవ్వనున్నారు. జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని 587 పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 87,792 మంది విద్యార్థులు దీని ద్వారా లబ్ధి పొందుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యార్థులందరికీ రాగిజావ అందించేలా విద్యాశాఖ అధికారులు దృష్టి సారించారు.

ఏర్పాట్లు పరిశీలించిన డీఈవో

ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా రాగిజావ ఇచ్చే కార్యక్రమాన్ని అమలు చేస్తున్న నేపథ్యంలో వేడుకగా ప్రారంభించేందుకు జిల్లా విద్యాశాఖాధికారులు దృష్టి సారించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించే ప్రారంభోత్సవ వేడుకను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తిలకించేందుకు కలెక్టరేట్‌లో ఏర్పాట్లు చేశారు. ఇదిలా ఉండగా రాగి జావ అమలుపై అప్రమత్తం చేసే క్రమంలో డీఈవో ఎల్.చంద్రకళ సోమవారం అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సందర్శించారు. రాగి జావ అమలుకు పాఠశాలలో చేస్తున్న ఏర్పాట్లపై హెచ్ఎం ఇమంది పైడిరాజును అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు సరఫరా అయిన రాగి జావ, బెల్లం పొడి ప్యాకెట్లను పరిశీలించారు. విద్యార్థుల్లో రక్త హీనత నివారణకు రాగిజావ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా దీనిని సమర్థవంతంగా అమలు చేసేందుకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తగిన శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు.

పాఠశాలల్లో మెనూ..

సోమవారం : పొంగలి/బిర్యానీ, గుడ్డుకూర, వేరుశనగ చిక్కీ

మంగళవారం:- పులిహోర, దొండకాయ చట్నీ, ఉడికించిన గుడ్డు, రాగిజావ

బుధవారం:- కూరగాయలతో అన్నం, బంగాళ దుంప కుర్మా, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కీ

గురువారం:- సాంబార్ అన్నం/ నిమ్మకాయ రైస్, ఉడికించిన గుడ్డు, రాగిజావ

శుక్రవారం -అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చిక్కీ

శనివారం:- ఆకుకూర అన్నం, రసం, తీపి పొంగలి, రాగిజావ

పోషణ్ అభియాన్‌తో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న చిన్మయిదేవి

ఎంవీపీకాలనీ: పోషణ్ అభియాన్ పథకంతో మహిళలకు సంపూర్ణ ఆరోగ్యం సాకారమవుతోందని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ జి.చిన్మయిదేవి అన్నారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పోషణ్ అభియాన్ పథకంపై సర్పంచ్‌లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషణ్ అభియాన్ పథకం ద్వారా యుక్త వయసులోని బాలికలు, గర్భిణులు, పాలిచ్చే తల్లులతో పాటు 0–6 వయసు గల పిల్లలపైనా ప్రత్యేక దృష్టిపెట్టినట్లు తెలిపారు. పోషకాహారలోపం, రక్తహీనత, తక్కువ బరువు వంటి అంశాలను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ వారి సంపూర్ణ ఆరోగ్యానికి అనుగుణంగా ఆహారం అందించడం జరుగుతుందన్నారు. ఆయా గ్రామాల పరిధిలో సర్పంచ్‌లు ఈ కార్యక్రమంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వరీ, రీజనల్ ఆర్గనైజర్ మాధవివర్మ, కేర్ ఇండియా సభ్యుడు సుబ్రహ్మణ్యం, మహిళ కమిషన్ సభ్యురాలు దేవి, వాసవి విల్లా పాల్గొన్నారు. సర్పంచ్‌లు హాజరయ్యారు.

భారత్, ఆస్ట్రేలియా జట్లకు వీడ్కోలు

విశాఖ స్పోర్ట్స్: భారత్, ఆస్ట్రేలియా జట్లు చెన్నైకు పయనమయ్యాయి. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా విశాఖలో ఆదివారం జరిగిన రెండో వన్డేలో ఆస్ట్రేలియా విజయం సాధించింది. రాత్రి హోటల్‌లో బస చేసిన ఆస్ట్రేలియా జట్టు సోమవారం మధ్యాహ్నం 2.50 గంటలకు, భారత్ జట్టు మూడు గంటలకు బయలుదేరాయి. విమానాశ్రయంలో విశాఖ క్రీడాభిమానులు ఇరుజట్ల ఆటగాళ్లకు వీడ్కోలు పలికారు. సిరీస్‌లో చెరో మ్యాచ్‌లో విజయం సాధించి సమఉజ్జీగా నిలిచిన ఇరుజట్లు చెన్నైలో బుధవారం చివరిదైన మూడో వన్డే మ్యాచ్‌లో తాడోపేడో తేల్చుకోనున్నాయి.



ఎయిర్‌పోర్టులో భారత కెప్టెన్ రోహిత్ శర్మ, రాహుల్, హార్దిక్ పాండ్యా, శుభమన్ గిల్



కోచ్ రాహుల్‌ద్రావిడ్, రవీంద్ర జడేజా, ఆస్ట్రేలియా ఆటగాళ్లు డేవిడ్ వార్నర్, స్మిత్, మిచెల్ మార్ష్

మేలు చేసిన వర్షాలు!

- మామిడికాయలు గట్టిపడేందుకు దోహదం
- వరి, మొక్కజొన్న పంటలకు ప్రయోజనం
- ఈదురుగాలులు లేకపోవడంతో తప్పిన పంట నష్టం



ఆనందపురం మండలం కుసులువాడలో కాయలతో ఉన్న మామిడిచెట్టు

సాక్షి, విశాఖపట్నం: అకాల వర్షాలు జిల్లాలో పంటలకు మేలు చేశాయి. ఈ వానలు మామిడి కాయల తొడిమలు/ముచ్చుకలు గట్టిపడి రాలపోకుండా కట్టడి చేయడానికి దోహదపడతాయి. సాధారణంగా ఈ దశలో ఉన్నప్పుడు రైతులు మామిడి తోటలకు నీరు పెడుతుంటారు. దీనివల్ల పిందె గట్టిపడి గాలులను తట్టుకుని నిలబడతాయి. అయితే ఇప్పుడు నీరు పెట్టే అవసరం రాకుండా అదనులోనే వానలు కురిసి మామిడి రైతులకు ఊరట నిచ్చాయి. ఈ సీజనులో మామిడి చెట్ల ఆకులకు దుమ్ము, ధూళి పడుతుంది. దీనివల్ల తెగుళ్లకు ఆస్కారమేర్పడుతుంది. ఈ వర్షాలకు మామిడి చెట్ల ఆకులకు పట్టిన దుమ్ము, ధూళి కొట్టుకుపోవడం వల్ల తెగుళ్లు సోకే ప్రమాదమూ తప్పింది. అలాగే జీడి తోటలకు కూడా ఈ వర్షాలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. మామిడికాయలు మాదిరిగానే జీడి పిక్కలు కూడా నాణ్యత పెరగడానికి ఇవి దోహదపడనున్నాయి. అంతేకాదు.. విశాఖ జిల్లాలో కూరగాయలు, ఆకుకూరల పంటలకు ఈ వానలు మేలు చేశాయి. ఇటీవల కాస్తున్న ఎండల తీవ్రతకు ఈ పంటలు ఎండిపోయే స్థితికి చేరుకున్నాయి. బోర్లు కూడా పూర్తి స్థాయిలో నీటిని అందించలేక పోతున్నాయి. ఈ సమయంలో కురిసిన అకాల వర్షాలు ఇటు మామిడి, జీడి తోటలను, అటు కూరగాయలు, ఆకుకూరల పంటలను కూడా ఆదుకున్నాయని జిల్లా ఉద్యానశాఖ అధికారి మన్మథరావు 'సాక్షి'కి చెప్పారు. సాధారణంగా అకాల వర్షాలతో పాటు ఈదురుగాలులు వీస్తుంటాయి. రాష్ట్రంలో పలుచోట్ల ఈదురు గాలులు బీభత్సాన్ని సృష్టించి పంటలను బాగా దెబ్బతీశాయి. మామిడిని నేల రాల్చాయి. ఈ జిల్లాలో ఈదురుగాలులు వీయకపోవడం వల్ల మామిడి నేల రాలిపోయే ప్రమాదాన్ని తప్పించాయని మామిడి రైతులు ఊరట చెందుతున్నారు.

వరి, మొక్కజొన్నలకూ..

ఇక వరి, మొక్కజొన్న పంటలకూ ప్రస్తుత వర్షాలు మేలు చేశాయని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. ఈ రబీ సీజనులో విశాఖ జిల్లాలో 1,100 ఎకరాల్లో వరి, 1,200 ఎకరాల్లో మొక్కజొన్న పంట వేశారు. వీటిలో వరి ప్రస్తుతం పిలకలు, చిరు పొట్ట దశలోను ఉంది. వర్షాధారంపై ఆధారపడ్డ ప్రాంతంలో ఈ రెండు పంటలకు ప్రస్తుతం తడులు అవసరమవుతాయి. ఈ తరుణంలో అనూహ్యంగా కురిసిన వానలు ఈ పంటలకు ఊపిరిపోశాయని జిల్లా వ్యవసాయాధికారి అప్పలస్వామి 'సాక్షి'కి చెప్పారు. పైగా బోర్ల ప్రాంతాల్లో భూగర్భ జలాలు కూడా పెరిగేందుకు దోహదపడతాయని తెలిపారు.

స్పందన అర్జీలకు తక్షణ మోక్షం



వినతులు స్వీకరిస్తున్న జేసీ విశ్వనాథన్

మహారాణిపేట : స్పందన అర్జీలను కాలపరిమితి లోగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్, ఎమ్మెల్సీ ఎన్నికలు విజయవంతంగా పూర్తి చేసేందుకు సహకరించిన అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఉదయం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో స్పందన దరఖాస్తుల పరిష్కారంపై అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అర్జీలను వెంటనే పరిష్కరించాలన్నారు. జిల్లాలో వివిధ కార్యాలయాల్లో దివ్యాంగుల పోస్టులు భర్తీ చేసేందుకు రోస్టర్ వెరిఫికేషన్ చేసి సత్వరమే ఖాళీల వివరాలు పంపాలని జేసీ ఆదేశించారు. సోమవారం నాటి స్పందనలో 155 విజ్ఞప్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో శ్రీనివాస మూర్తి, పోలీస్ అధికారులు, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

భూసేకరణకు వినతి

భీమిలి మండలం కొత్తవలస గ్రామం జేవీ అగ్రహారం పంచాయతీలో సర్వే నంబర్ 75లో భూసేకరణ నిమిత్తం తమ భూమిని ఇచ్చామని, నాలుగేళ్లగా దీనిపై ఫలసాయం పొందలేకపోతున్నామని రైతులు పిన్నింటి నరసింహారావు, పాపి అప్పలనాయుడు స్పందనలో విజ్ఞప్తి చేశారు. గతంలో ఈ భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగించేవాళ్లమన్నారు. భూ సేకరణ పనులు త్వరగా మొదలు పెట్టాలని రైతులు కోరారు.

రేపు ఉగాది వేడుకలు

ఉగాది వేడుకను బుధవారం సిరిపురం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనా వేదికగా నిర్వహిస్తున్నట్లు జేసీ విశ్వనాథన్ పేర్కొన్నారు. అధికారులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వినతులను మూడు రోజుల్లో పరిష్కరించాలి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ స్పందనకు వచ్చే అర్జీలను మూడు రోజుల్లో పరిష్కరించాలని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం జీవీఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు స్పందన కార్యక్రమాన్ని అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించామని, వాటిలో జోన్-1 నుంచి ఒకటి, జోన్-2 నుంచి ఏడు, జోన్-3 నుంచి 16, జోన్-4 నుంచి 10, జోన్-5 నుంచి 12, జోన్-6 నుంచి 14, జోన్-7 నుంచి 1, జోన్-8 నుంచి 9 అర్జీలు అందగా, జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సంబంధించి 4 వినతులు వచ్చాయని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, పట్టణ ప్రణాళికా అధికారి బి.సురేష్‌కుమార్, డీసీ (రెవెన్యూ) ఫణిరాం, రీజనల్ ఫైర్ ఆఫీసర్ సీహెచ్ కృపావాసం, ఎఫ్ఏ అండ్ ఏవో మల్లికాంబ, డీపీవో చంద్రిక, పీవో (యూసీడీ) సూర్యకళ, డీసీపీలు, ఏసీపీలు, పర్యవేక్షక ఇంజినీర్లు, యూసీడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్ వద్ద ఇరుక్కుపోయిన ట్యాంకర్



క్రేన్ సాయంతో తొలగిస్తున్న అగ్ని మాపక సిబ్బంది

గోపాలపట్నం: ఎన్ఏడీ ఫ్లై ఓవర్ దిగువ రోడ్డులో సోమవారం ఓ ఆయిల్ ట్యాంకర్ ఇరుక్కుపోయింది. దీంతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. విజయనగరం నుంచి రాజమండ్రి వెళుతున్న ఆయిల్ ట్యాంకర్ ఎన్ఏడీ ఫ్లై ఓవర్ దిగువ రోటరీలోకి రావడంతో ఫుట్ ఓవర్ వంతెన వద్ద ఇరుక్కు పోయింది. కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు, మర్రిపాలెం ఫైర్ అధికారులు ఘటన స్థలానికి చేరుకుని క్రేన్ సాయంతో లారీని బయటకు తీయగలిగారు. సుమారు రెండు గంటల పాటు ఈ ప్రక్రియ కొనసాగింది. అంతవరకు వాహనాలు ఫ్లై ఓవర్ మీదనుంచి రాకపోకలు సాగించాయి. మధ్యాహ్నం నుంచి యథావిధిగా ఫ్లై ఓవర్ దిగువ రోడ్డు నుంచి రాకపోకలు సాగాయి.

ప్రయోగాలపై దృష్టి సారించాలి

- డీఈవో చంద్రకళ వెల్లడి
- రాష్ట్ర స్థాయికి రెండు ప్రాజెక్టులు



ఎంపికైన జీవీఎంసీ-సీఎంఆర్ ప్రకాశరావుపేట స్కూల్ విద్యార్థుల ఎల్‌పీజీ లీకేజ్ డిటెక్టర్ ప్రదర్శన

విశాఖ విద్య: విద్యార్థులు సైన్స్ సంబంధిత రంగాల్లో ప్రయోగాల వైపు దృష్టి పెట్టాలని డీఈవో చంద్రకళ అన్నారు. ఏపీఎస్ఈఆర్టీ, ఎస్ఎస్ఏ, లాభాపేక్ష లేని సంస్థల కూటమి సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మాధవధార జీవీఎంసీ హైస్కూల్‌లో జిల్లా స్థాయి సైన్సు ఫెయిర్ నిర్వహించారు. జిల్లాలోని 98 పాఠశాలల నుంచి 299 ప్రాజెక్టులు నమోదు చేసుకోగా, వీటిలో ఎంపికైన 10 ప్రాజెక్టులు మంగళవారం నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రదర్శించారు. కార్యక్రమాన్ని డీఈవో చంద్రకళ ప్రారంభించి, పోటీల్లో పాల్గొన్న ప్రదర్శనలను తిలకించారు. ప్రాజెక్టుల తయారీపై విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుకునే సమయంలో సమాజంలోని సమస్యలను గుర్తించి, వాటికి పరిష్కార మార్గాలు చూపేలా సరికొత్త ఆలోచనలతో ముందుకు సాగాలన్నారు. జిల్లా స్థాయి పోటీలకు న్యాయ నిర్ణేతలుగా భీమిలి డైట్ అధ్యాపకులు నాగేశ్వరరావు, రవి వ్యవహరించి, రెండు ప్రాజెక్టులు(ప్రకాశరావుపేట జీవీఎంసీ హైస్కూల్, అగనంపూడి జెడ్పీ హైస్కూల్) రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ యు.మాణిక్యం నాయుడు, జిల్లా సైన్సు అధికారి ఎం.వీ. విశ్వేశ్వరరావు, ఈఎండీపీ జోనల్ మేనేజర్ శర్మ, జిల్లా మేనేజర్ నరేష్ పాల్గొన్నారు.

స్మార్ట్‌గా పాఠాలు..!

- ప్రభుత్వ పాఠశాలల్లో సరికొత్త చదువులు
- జాతీయ స్థాయిలో పోటీపడేలా తర్ఫీదు
- విద్యార్థులకు ఉపయోగకరంగా ట్యాబ్‌లు
- ప్రయోగాత్మకంగా 8వ తరగతిలో అమలు
- విశాఖ జిల్లాలో 12,480 ట్యాబ్‌ల పంపిణీ
- సత్ఫలితాలిస్తున్న బైజూస్ కంటెంట్ పాఠాలు



మాధవధార స్కూల్లో ట్యాబ్‌ల ద్వారా చదువుకుంటున్న విద్యార్థులు



ట్యాబ్ వినియోగిస్తున్న శ్రీకృష్ణాపురం గురుకుల విద్యార్థి

విశాఖ విద్య: ప్రభుత్వ పాఠశాలల్లో సరికొత్త చదువులకు వడివడిగా అడుగులు ముందుకు పడుతున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో నాణ్యమైన విద్యాబోధన సాగేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంది. ఈ నేపథ్యంలోనే 8వ తరగతి విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో అందించిన ట్యాబ్‌ల ద్వారా ×స్మార్ట్ పాఠ్యాంశాలు× బోధన సత్ఫలితాల దిశగా సాగుతోంది. వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండేలా తాజాగా 9వ తరగతి పాఠ్యాంశాలను కూడా ట్యాబ్‌లో నిక్షిప్తం చేశారు.

జాతీయ స్థాయిలో పోటీపడేలా..

ప్రభుత్వ బడుల్లో చదువుకునే విద్యార్థులు జాతీయ స్థాయిలో పోటీ పడేలా పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నారు. దీనిలో భాగంగానే అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన బైజూస్ సంస్థ ద్వారా పాఠ్యాంశాల బోధన చేపట్టేలా ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. తొలుత 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను అందించి, వీటిలో అన్ని సబ్జెక్టులకు సంబంధించిన కంటెంట్‌ను ట్యాబ్‌లో నిక్షిప్తం చేశారు. భవిష్యత్‌లో పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేసే క్రమంలో ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనేలా ట్యాబ్‌లో వెసులుబాటు కల్పించారు. ఈ క్విజ్ పోటీల్లో దేశ వ్యాప్తంగా ఉన్న విద్యార్థులు భాగస్వామ్యులౌతున్నందున మన విద్యార్థులకు ఎంతో మేలు చేస్తోంది.

జిల్లాలో 12,480 ట్యాబ్‌ల పంపిణీ

బైజూస్ ప్రీమియం కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను ప్రభుత్వం సరఫరా చేసింది. జిల్లాలో 2022-23 విద్యా సంవత్సరంలో 8వ తరగతి 11,274 మంది విద్యార్థులకు వీటిని ఉచితంగా పంపిణీ చేశారు. అదే విధంగా పాఠాలు బోధించే 1,206 మంది ఉపాధ్యాయులకు సైతం వీటిని అందజేశారు. బైజూస్ కంటెంట్‌తో నిక్షిప్తమై ఉన్న ఒక్కో ట్యాబ్‌పై ప్రభుత్వం రూ. 32,088లు వెచ్చించింది. జిల్లాలో వీటి కోసమని రూ.40 కోట్లు ఖర్చు చేసింది.

స్మార్ట్ పాఠాల కోసం ఆధునిక హంగులు

ప్రభుత్వ స్కూళ్లలో సాంకేతికతను అందుబాటులోకి తీసుకొచ్చేలా శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా నాడు-నేడు కింద అభివృద్ధి చేసిన పాఠశాలల్లో ఇంగ్లీషు ల్యాబ్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. బైజూస్ పాఠ్యాంశాల బోధనలో భాగంగా హైస్పీడుతో కూడిన ఇంటర్నెట్ సదుపాయం కల్పించాల్సి ఉన్నందున, దీనికి అనుగుణంగా ఆధునిక హంగులతో ఇంగ్లీషు ల్యాబ్, ఇదే చోట స్మార్ట్ టీవీ ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై చకాచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలి



ప్రభుత్వం ఉన్నతాశయంతో విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేసింది. బైజూస్ పాఠ్యాంశాల బోధనపై పాఠశాలల వారీగా మరింత పర్యవేక్షణ పెంచాం. విద్యార్థులు ఇంటి వద్ద వీటిని సవ్యంగా వినియోగించేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలి. ట్యాబ్‌లు పాడవ్వకుండా చూడాలి.

– ఎల్. చంద్రకళ, డీఈవో, విశాఖ జిల్లా

విద్యార్థులకు ఎంతో మేలు



బైజూస్ కంటెంట్‌తో కూడిన పాఠ్యాంశాల బోధన వల్ల విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది. ఏరోజుకారోజు ఎంత సమయం ట్యాబ్‌లను చూశారనేది పరిశీలిస్తాం. ట్యాబ్‌లు వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

– టి.శివరాం, ఉపాధ్యాయుడు, మాధవధార, జీవీఎంసీ హైస్కూల్

బాగా చదువుకుంటున్నాం



ఇంట్లో నాన్న ఒక్కరి దగ్గరే ఫోన్ ఉంటుంది. ట్యాబ్ కొనడటం మాలాంటోళ్లకు కష్టమే. అలాంటిది ట్యాబ్ చేతికొచ్చింది. ఇంటికి కూడా తీసుకెళ్తున్నాం. సబ్జెక్టులన్నీ దీనిలో ఉన్నాయి. ప్రతీ రోజూ దీని ద్వారా బాగా చదువుకుంటున్నాను. క్విజ్‌లో కూడా పాల్గొంటున్నాను.

– మురిపాక తులసి, మాధవధార హైస్కూల్, విశాఖ జిల్లా

నీట్ ర్యాంకర్‌కు ఎంపీ అభినందనలు



ఐశ్వర్యమినిని అభినందిస్తున్న ఎంపీ ఎంవీవీ

మహారాణిపేట: నీట్ పీజీ 2023లో ఆల్ ఇండియా 750వ ర్యాంకు సాధించిన ఐశ్వర్యమిని సిద్ధానాతిని ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అభినందించారు. సోమవారం ఎంపీని మర్యాద పూర్వకంగా కలిశారు. ఎంతో పట్టుదలతో కృషి చేస్తేనే ఇటువంటి ర్యాంకులు వస్తాయని, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ర్యాంకర్ ఐశ్వర్యమినిని ఎంపీ ఎంవీవీ ఆశీర్వదించారు. ఐశ్వర్యమిని ఎంసెట్ 2016లో 127 ర్యాంక్ సాధించి, విశాఖలో ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ చదివారు. ఆమె తండ్రి డాక్టర్ నవీన్ సిద్ధానాతిని ఆంధ్రా మెడికల్ కాలేజీలో జనరల్ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్, తల్లి పద్మావతి గృహిణి.

మహారాణిపేట తహసీల్దార్, సీఐకి షోకాజ్ నోటీసు

మహారాణిపేట: ఎన్నికల నియమావళి ఉల్లంఘించిన సంఘటనలో ఇద్దరు అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మహారాణిపేట తహసీల్దార్, మహారాణిపేట సీఐ వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నోటీసు జారీ చేశారు. తహసీల్దార్‌కు కలెక్టర్ మల్లికార్జున, సీఐకు నగర పోలీసు కమిషనర్ శ్రీకాంత్ నోటీసు జారీ చేశారు.

కళ్లద్దాల సరఫరాకు టెండర్ల ఆహ్వానం

మహారాణిపేట: ఉమ్మడి విశాఖ జిల్లాలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవసరమైన కళ్లద్దాలను సరఫరాకు టెండర్ల ఆహ్వానిస్తున్నట్టు జిల్లా అంధత్వ నివారణ సంస్థ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ విశ్వమిత్ర తెలిపారు. సుమారు 6 వేల మందికి సంబంధించి కళ్లద్దాల ఫ్రేమ్‌తో కలిపి ఒక్కొక్కటి రూ.280 మించకుండా సీల్డ్ కవర్ ద్వారా ఈనెల 27వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు 5 వేల రూపాయలు దరావత్తుతో జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్య శాల సూపరింటెండెంట్ కార్యాలయంలో టెండర్ దాఖలు చేయవలసిందిగా ఆమె కోరారు.

హిందీ హయ్యర్ పరీక్షా ఫలితాల విడుదల

తగరపువలస (భీమిలి): ఈ ఏడాది ఫిబ్రవరిలో దక్షిణ భారత హిందీ ప్రచారసభ –చెన్నై ఆధ్వర్యంలో నిర్వహించిన హయ్యర్ పరీక్షా ఫలితాలు సోమవారం విడుదల అయ్యాయి. భీమిలి నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్ కేంద్రంగా పరీక్షలు రాసిన రాష్ట్ర భాష విశారద పూర్వార్ధ–ఉత్తరార్ధ, రాష్ట్ర భాష ప్రవీణ పూర్వార్ధ–ఉత్తరార్ధ పరీక్షలలో 26 మంది విద్యార్థులకు గాను ఇద్దరు గైర్హాజరు కాగా మిగిలిన 24 మంది ఉత్తీర్ణులయ్యారన్నారని ఆదర్శ ప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు.

మనీ చేంజర్స్‌పై వర్క్‌షాప్



పాతనగరం టౌన్‌హాల్‌ను సందర్శించిన బృందం

దాబాగార్డెన్స్: విశాఖలో ఈ నెల 28, 29 తేదీల్లో జరగనున్న జీ-20 సదస్సుపై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వారం రోజుల పాటు (ఈ నెల 27 వరకు జన్ భగీదరి కార్యక్రమాలు) వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనుంది. దీనిలో భాగంగా సోమవారం నగరంలోని ఓ హోటల్లో జన్ భగీదరి కార్యక్రమంలో భాగంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పూర్తి స్థాయి మనీ చేంజర్స్‌పై వర్క్‌షాప్ నిర్వహించింది. విదేశీ కరెన్సీకి సంబంధించిన ఆర్థిక లావాదేవీలు, వారి ద్వారా మార్పిడి, సరళీకృత చెల్లింపు పథకం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఎఫ్ఎఫ్ఎమ్‌సీల నుంచి డైరెక్టర్లు, సిబ్బంది, విదేశీ ద్రవ్య సంస్థల సంఘం నుంచి కమిటీ సభ్యులు పాల్గొన్నారు. వసుదైవ కుటుంబం థీమ్‌తో ప్రతిబింబించే జీ-20 అవగాహనను ప్రోత్సహించడానికి ఆర్‌బీఐ చేపడుతున్న వివిధ కార్యకలాపాలు వివరించారు. అనంతరం ఈ బృందం పాతనగరంలో గల టౌన్‌హాల్‌ను సందర్శించింది.

వచ్చే నెల 5లోగా ప్రభుత్వం స్పందించాలి



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న పలు శాఖల ఉద్యోగులు

మహారాణిపేట : ఉద్యోగ, కార్మిక సమస్యల సాధన కోసం ఆందోళన ఉధృతం చేస్తామని జేఏసీ రాష్ట్ర సెక్రటరీ జనరల్ జేపీపీటీడీ (ఆర్టీసి) ఎంప్లాయిస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న ఉద్యోగ, ఉపాధ్య, కార్మిక, రిటైర్డు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించి ఆర్థిక, ఆర్థికేతర సమస్యల పరిష్కారానికి వచ్చే నెల 5లోగా స్పష్టమైన హామీ ఇవ్వకపోతే భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. సోమవారం కలెక్టరేట్ వద్ద భోజన విరామ సమయంలో పలు శాఖల ఉద్యోగులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎస్ రద్దు, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాల పెంపుదల తదితర సమస్యలు పరిష్కరించాలన్నారు. ఏపీజేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ సత్తి నాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ ఏప్రిల్-5వ తేదీ వరకు నల్ల బ్యాడ్జీలతో నిరసనలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు యస్.శ్రీదేవి, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు యస్.ఏ.త్రినాథరావు, క్లాస్ 4 ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నమ్మి శ్రీనివాస రావు, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎస్.రామారావు, పలు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.